క్లుప్తంగా

269 మద్యం బాటిళ్ల ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పలు కేసులకు చెందిన 17 మద్యం కేసుల్లోని 269 మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి శుక్రవారం తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ధ్వంసం చేసినట్లు ఆమె వివరించారు.

పీసీపల్లి ఎంపీడీవోగా కృష్ణారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణారావు

పీసీపల్లి: పీసీపల్లి నూతన ఎంపీడీవోగా జీవి కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సింగరాయకొండలో ఏవోగా పనిచేస్తున్న కృష్ణారావు ప్రమోషన్ మీద పీసీపల్లికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవో పనిచేస్తున్న హనుమంతరావు, హనుమంతునిపాడు ఏవోగా ఆయన స్థానానికి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెడతానని తెలిపారు. కార్యక్రమంలో కార్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఏపీటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న మండలంలోని నల్లమడుగుల జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్) వైవీ సుబ్బారావు, డీజి పేట జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (గణితం) జి.వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ ఆనికాలపల్లి ఎస్‌జీటీ జె.భారతిను మండల కేంద్రమైన సీఎస్‌పురం ప్రధాన పాఠశాలలో శుక్రవారం రాత్రి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్.ఆనంద్‌బాబు, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

టంగుటూరు: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం టంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బాబుజీ కాలనీలో డీపీవో, డీఎల్ పీఓ పద్మజ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకి ఇరువైపునున్న చెట్లను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామసుబ్బారావు, ఏపీఓ మాచర్ల, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి డివిజన్‌లో 234 మి.మీల వర్షపాతం నమోదు

కనిగిరిరూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు 234 మీమీల వర్షపాతం నమోదైంది. డివిజన్‌లో సరాసరిన 18.0 మి.మీల వర్షం పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలంలో 52 మి.మీ, వెలిగండ్ల 7 మి.మీ, నమోదైంది. శుక్రవారం రాత్రి 6 గంటల నుంచి ఎడతెరిపి లేని చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. వర్షానికి శివారు ప్రాంతాల్లోని మట్టి రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.

టంగుటూరులో కుండపోత వర్షం

టంగుటూరు: మండలంలో అన్ని గ్రామాల్లో కుండపోతగా వర్షం కురవడంతో రహదారులు జలమయ్యాయి. అలాగే పోతుల చెంచయ్య కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్ములపాలెంలో వర్షం నీరు రోడ్లపై పారడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అలాగే కొండపి ఫ్లైఓవర్ నుంచి టంగుటూరు బొమ్మల సెంటర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆ గుంతల్లో వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాదారులు నానా ఇబ్బందులు పడ్డారు. మండలంలో 40.2 మి.మీ వర్షపాతం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

ప్రమాదం.. తప్పదు ప్రయాణం !



ప్రమాదకరంగా ప్లాట్‌ఫాం దిగి పట్టాలు దాటి వెళ్తున్న ప్రయాణికులు



గూడ్సు రైలు కింద నుంచి దూరి వస్తున్న ప్రయాణికులు

- రైలు ఎక్కాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే
- సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల దుస్థితి
- ప్రమాదాల బారిన ప్రయాణికులు

సింగరాయకొండ:

అది ప్రమాదం అని తెలుసు.. కాని తప్పదు అన్నట్లుగా ప్రయాణికులు రైలు పట్టాలు దాటుతున్నారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే. స్థానిక సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో రెండో నెంబరు ప్లాట్‌ఫాం మీదకు వెళ్లాలంటే ప్రయాణికులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి ఉందని రైల్వే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో సుమారు రూ.25 కోట్ల అంచనా వ్యయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టారు. కాని పనులు నేటికి నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రయాణికులు పక్క ప్లాట్‌ఫాంలకు వెళ్లాలంటే విశాలమైన అధునాతన ఫుట్‌ఓవర్ బ్రిడ్జితో పాటు లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటి పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు పాత బ్రిడ్జినే ఉపయోగిస్తున్నారు.

పట్టించుకోని రైల్వే అధికారులు..

అంతేకాక నెల్లూరు వైపు వెళ్లాలన్నా, ఒంగోలు వైపు నుంచి వచ్చిన రైలు దిగి ప్రయాణికులు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకు రావాలన్నా పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై కాని, ఒకటి, రెండు ప్లాట్‌ఫాంలు కలిసే విధంగా ప్లాట్‌ఫాంలకు దక్షిణం వైపు నిర్మించిన నడకదారిని ఉపయోగిస్తారు. గత 5 నెలలుగా ఈ నడకదారికి అడ్డంగా రైలు నిలపటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యువకులు అయితే రైలు కింద నుంచి దూరి వెళుతుండగా వృద్ధులు మాత్రం రైలు కింద నుంచి దూరి వెళ్లలేక, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు తనిఖీల పేరుతో డివిజన్ స్థాయి అధికారులు వస్తున్నారే తప్ప ప్రయాణికుల సమస్యలు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కావున అధికారులు స్పందించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయటంతో పాటు, నడకదారిపై నడవడానికి వీలుగా రైలు లేకుండా జాగ్రత్త వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మెడిసిన్ విద్యను దూరం చేస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



మార్కాపురం వెళ్తున్న పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల, పార్టీ నేతలు

కనిగిరిరూరల్: చంద్రబాబు ప్రభుత్వం పేద వర్గాలకు మెడిసిన్ విద్యను దూరం చేస్తోందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. 'ఛలో మార్కాపురం మెడికల్ కాలేజ్' కార్యక్రమం ర్యాలీని శుక్రవారం దద్దాల నారాయణయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేసి, వాటిలో 5 కాలేజీలను ప్రారంభించారని గుర్తు చేశారు. కనిగిరి నియోజకవర్గం నుంచి దద్దాలతో పాటు, పార్టీ నేతలు భారీగా వాహనాల్లో బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, చప్పిడి సుబ్బయ్య, గంసాని లక్ష్మీరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు యక్కంటి శ్రీను, జీ బొర్రారెడ్డి, గజ్జల వెంకరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్దన్‌రెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, ఏ నాగమణి, డాక్టర్ రసూల్, ఎస్‌కే రహీం, జీ ఆదినారాయణరెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, దరిశి సుబ్రహ్మణ్యం, ఫణీ, నరేష్, మూలే రాజశేఖరరెడ్డి, ఎస్‌కే గయాజ్, రామనబోయిన శ్రీను, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, శ్రీహరిరెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, టీ ఉమా శంకర్‌రెడ్డి, పలుకూరి భాస్కర్, దాసరి మురళీ, మేలక మాల్యాద్రి, గట్లా విజయ భాస్కర్‌రెడ్డి, సాంబిరెడ్డి, వెంగళరావు గుప్తా, పొల్లా సుబ్రహ్మణ్యం, టీ సురేష్‌బాబు, నాని, ఎలికా నారాయణ, సంగటి మహేంద్రారెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పీడీసీసీబీ మాజీ చైర్మన్, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ), న్యాయవాదులు సానికొమ్ము శ్రీనివాసులరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పులి రమేష్ రెడ్డి తదితరులు మార్కాపురం వెళ్లారు.

మార్కాపురానికి తరలిన పార్టీ శ్రేణులు



మార్కాపురం వెళ్లిన సింగరాయకొండ నాయకులు



మార్కాపురం కాలేజ్ వద్ద జరుగుమల్లి మండల నాయకులు

సింగరాయకొండ: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు మార్కాపురం తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు, బచ్చల కోటేశ్వరరావు, కనపర్తి శేషారెడ్డి, షేక్ సుల్తాన్, మారంరెడ్డి గంగాధరరెడ్డి, కోమిట్ల వెంకారెడ్డి, బత్తిన మనోహర్, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, సయ్యద్ ఆబిద్‌ఆలీ, నాగార్జునరెడ్డి, భాను, కళ్యాణ్, పార్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగితే చర్యలు



మద్యం సీసాలను సిబ్బందితో తొలగిస్తున్న ఎస్సై ప్రేమ్ కుమార్

కొండపి: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రేమ్‌కుమార్ మద్యం బాబులను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలో తాగి పడేసిన బాటిళ్లను పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజల సహాయంతో వాటిని తగలబెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని ఎటువంటి పరిస్థితులలో వదిలేది లేదన్నారు. వారిని గుర్తించి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంకారావు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనధికార బ్యార్న్లు నిర్మిస్తే చర్యలు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్

టంగుటూరు: రైతులు బోర్డు అనుమతి లేకుండా అనధికారికంగా పొగాకు బ్యార్న్లు నిర్మించరాదని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 346 పలికింది. టంగుటూరు, జరుగుమల్లి, సాధువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1010 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 886 కొనుగోలు జరగగా, 124 బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 346 పలకగా, కనిష్ట ధర రూ.110 పలకగా, సరాసరి రూ. 270. 88 ధర పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.346

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.346 పలికిందని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్. పొస్టర్ పరిధిలోని అనకర్లపూడి, ముప్పరాజువారిపాలెం పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1166 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 855 బేళ్ల కొనుగోలు అయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 281 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర కేజీ రూ 104, సరాసరి ధర కేజీ రూ. 204.95గా నమోదైంది. చూర కేజీ 25 పలికింది. వేలంలో 21 కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు



హద్దులు తీసివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ షేక్.మహ్మద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని రేగులచెలక గ్రామంలో సర్వే నంబర్ 224/1లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి సాగుకు సిద్ధం చేశారు. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి ఆక్రమణలను తొలగించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలి



టంగుటూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

సింగరాయకొండ: అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠిన చర్యలు చేపట్టి లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉండేలా కృషి చేయాలని ఎస్పీ వీ హర్షవర్ధన్‌రాజు అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆఫీసు రికార్డులను పరిశీలించి నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పేకాట, కోడిపందేలు, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, మహిళలు, చిన్నారుల పట్ల అత్యాచారాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందిని పేరు పేరునా పరిచయం చేసుకుని తరువాత కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. వరాహా లక్ష్మీనరశింహస్వామి దేవస్థానానికి వెళ్లి పూజలు నిర్వహించారు. ఏఎస్పీ(అడ్మిన్) కె నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సిఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు

టంగుటూరు: ట్రాఫిక్ నివారణ,రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. టంగుటూరు పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్లోని నిర్వహించే పలు రికార్డులు పరిశీలించి నమోదైన కేసులపై ఆరా తీశారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, టంగుటూరు ఎస్సై నాగేమలేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

కొండచిలువ కలకలం



నడిరోడ్డులో ఉన్న కొండచిలువ

కొండపి: మండల కేంద్రంలో కొండపి నుంచి పొదిలి వెళ్లే రోడ్డులో చాణిక్య కళాశాల సమీపంలో శుక్రవారం రాత్రి కొండచిలువ కలకలం రేపిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోడ్డుకు ఎడమవైపు నుంచి రోడ్డు మీదకు వచ్చి దాదాపు రెండు గంటల పాటు కొండచిలువ అక్కడే ఉంది. రోడ్డు మీద నుంచి ప్రయాణించే వాహనదారులు కొండచిలువను తప్పిస్తూ ప్రయాణాన్ని కొనసాగించారు. కొంతసేపటి తర్వాత పక్కనే ఉన్న కళాశాలకు సంబంధించి బాత్రూంల వైపు వెళ్లడంతో స్థానికులు భయాందోళన చెందారు. భయంతో చివరకు కొండచిలువను బయటకు తీసి కర్రలతో కొట్టి చంపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

పామూరు: మండలంలోని వగ్గంపల్లె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కబడ్డీ బాలికల విభాగం అండర్-14, 17 విభాగంలో మొదటి స్థానం, అదేవిధంగా బాలుర విభాగం అండర్-14లో ప్రథమస్థానం, అండర్-17లో ద్వితీయస్థానం సాధించారు. ఖోఖో బాలికల అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. లక్ష్మీ నరసాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కబడ్డీ, ఖోఖోలో సీనియర్స్ బాయ్స్, ఖోఖోలో జూనియర్ బాయ్స్, గరల్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఖోఖో సీనియర్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను వగ్గంపల్లె హెచ్ఎం నరసరాజు, పీఈటీ మీనుగ నరసింహారావు, ఎల్ఎన్.పురం హెచ్ఎం పేట తిరుపతిరెడ్డి, పీఈటీ షేక్ ఖాజామస్తాన్‌లు అభినందించారు.

సచివాలయాల్లో సర్వర్ కష్టాలు



సర్వర్ కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

కొండపి: సచివాలయాలలో సర్వర్ కష్టాలతో లబ్ధిదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి అంతంత మాత్రమే వచ్చిన సర్వర్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి పూర్తిస్థాయిలో పనిచేయక సచివాలయం సేవల నిమిత్తం వచ్చే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహన మిత్రకు నూతనంగా దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 19న ఆఖరు తేదీన నిర్ణయించింది. సమయం ముగిసినా సర్వర్ రాకపోవడంతో వాహన మిత్రకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఏ ఒక్క సర్వర్ పని చేయక కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా సర్వర్ రాకపోవడంతో వాహన మిత్రులకు దరఖాస్తు చేసుకోవడానికి అనేకమంది ఆగిపోయారని, ప్రభుత్వం దరఖాస్తు తేదీలను పొడిగించి సర్వర్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, పక్కన చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: సీజనల్ వ్యాధులు, విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్ హెచ్ఓ టీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం శివారు ప్రాంతాలైన కాశిరెడ్డి కాలనీ, శివనగర్ కాలనీ, బొగ్గులగొంది కాలనీల్లో ఆయన పర్యటించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పేద వర్గాలు నివసించే ప్రాంతాల్లో జ్వర పీడిత లక్షణాలు కన్పించినా, వైరల్ జ్వరాలు వచ్చినా వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్ డీఎంఅండ్‌హెచ్ఓ టీ వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం దారుణం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు

కనిగిరిరూరల్: విద్యారం సమస్యలపై అసెంబ్లీలో చర్చలు జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అజయ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు అజయ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, పీపీపీ విధానంలో 10 మెడికల్ కాలేజీలను కార్పొరేట్ శక్తులకు లీజుకు ఇవ్వడాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన 16 నెలలు కావస్తున్నా.. విద్యా రంగ సమస్యలను పట్టించుకోలేదని తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రోహిత్, సుల్తాన్, తరుణ్, మోజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న వీఆర్ఏల రాష్ట్ర ఉపాధ్యక్షుడు వివేకానంద, వీఆర్ఏలు

టంగుటూరు: వీఆర్ఏ సమస్యలు తక్షణ పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కారం కోసం వీఆర్ఏ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 వేల మంది వీఆర్ఏలు రెవెన్యూ శాఖలో అట్టడుగు స్థాయిలో అనేక ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకోలేక అతి తక్కువ వేతనాలతో బతుకీడుస్తున్నారని చెప్పారు. 2024లో ఎన్నికలకు ముందు వాగ్దానాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత మరిచిందన్నారు. అర్హులైన వారిని ప్రమోషన్లు ఇవ్వలేదని, ప్రభుత్వం ఏర్పడి 14 నెలలైనా ఇంతవరకు సమస్యల్ని తీర్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మెలోకి వెళ్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఏలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు



పొన్నలూరులో పీహెచ్‌సీని తనఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు

పొన్నలూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీల సంఖ్య పెంచాలని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది హాజరు రిజిస్టర్‌ని, హాస్పటల్‌ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ×స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ే ఆరోగ్య శిబిరాలను సక్రమంగా నిర్వహించి గ్రామీణ ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కనిగిరిరూరల్: ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎంహెచ్‌వో టీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వస్థ నారీ సశక్త్ అభియాన్ వైద్య శిబిరాలను అయన శుక్రవారం పరిశీలించారు. ఇటీవల వైరల్ జ్వరాలు వచ్చిన బొమ్మిరెడ్డిపల్లి గ్రామాన్ని, పునుగోడు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను పరిశీలించి వైద్యులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిరోజ్, వైద్య సిబ్బంది విజయభాస్కర్, చెన్నయ్య, రామాంజనేయులు, ఉషారాణి, రమణ మ్మ, భవాని, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో తేడా వస్తే బిల్లుల్లో కోత



హెచ్ఎంపాడులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న స్టేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు

హనుమంతునిపాడు: రోడ్డు నిర్మాణంలో నాణ్యతలో లోపం ఉన్నట్లు తేలితే బిల్లులో కోత తప్పదని స్టేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు సీఈ కె.శేషికుమార్, ఎస్ఈ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కంభం-కనిగిరి రహదారిలో నిర్మించిన సీసీ రోడ్డును, కనిగిరి మార్కెట్ యార్డు వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.79 కోట్లతో జరుగుతున్న ఎన్‌డీబీ ఓపీ రోడ్డు పనులను, కనిగిరి నుంచి హనుమంతునిపాడు వరకు జరిగిన 10.6 కిలో మీటర్ల పనులు నాణ్యత పరిశీలించామన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఇఇ ఏడుకొండలు, ఎస్ఈ రవినాయక్, సాంబశిరావు జేఈ ఫిరోజ్ తదితరులు ఉన్నారు.